జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 27 | అక్టోబర్ | 2025 ◆ పేజీలు : 5

## విద్యతోనే కాదు, నైపుణ్యంతోనూ ఎదగాలి.

- యువతకు ఉపాధి,అవకాశాలు కల్పించడం నా బాధ్యత – జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.



**పాల్వంచ(రూరల్ ), అక్టోబర్ 26 (ప్రజాజ్యోతి):** స్వయం కృషితోనే గ్రామాభివృద్ధి సాధ్యం అని,పిల్లలకు విద్య అందించడం ద్వారా కుటుంబాల సామాజిక,ఆర్థిక స్థితిలో విశేష మార్పు తీసుకురావచ్చని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. ఆదివారం పాల్వంచ మండలంలోని బంద్రుగొండ

మిగతా 2 లో...

# ఆంధ్రా అక్రమ ఇసుక రవాణాతో తెలంగాణ టీడీజీఎండీసీకి కోట్ల రూపాయాల ఆదాయంకు గండి

- తెలంగాణ సరిహద్దుల్లో ఇసుక స్టాక్ పాయింట్లు.... భద్రాద్రిలో రాత్రివేళలల్లో అక్రమ రవాణా
- లారీ ఆక్రమ ఇసుక లోడు ఇసుక రూ.20 వేలకు అమ్మకం, ట్రాక్టర్ కు రూ.5 వేలు
- ప్రేక్షకపాత్రలో పోలీసు, రెవిన్యూ అధికారులు
- భద్రాచలంలో ఆక్రమంగా మట్టి, ఇసుక తోలకాలకు స్టాక్ పాయింట్
- సీతారామ ప్రాజెక్టు నుంచి ప్రభుత్వ మట్టిని భద్రాచలం తరలింపు?



**భద్రాచలం, అక్టోబరు 21, ప్రజాజ్యోతి :** భద్రాచలంకు సరిహద్దున ఉన్న ఆంధ్రప్రదేశ్ లోని గుండాల, యటపాకల నుంచి అక్రమ ఇసుకను తెలంగాణలోని భద్రాచలం, బూర్గంపాడు.. పాల్వంచ పరిసర ప్రాంతాల్లోకు తరలిస్తూ కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న అక్రమ వ్యాపారులు తెలంగాణ టీజీఎండీసీకి వచ్చే కోట్ల రూపాయల ఆదాయంకు భారీగా గండి కొడుతున్నారు. యటపాక గ్రామంలో నిబంధనలకు విరుద్దంగా ఓ పెట్రోలు బంకు వెనుక ఇసుక స్టాక్ పాయింట్ ఏర్పాటు చేసుకొని భద్రాచలంలో కొందరు జోరుగా అక్రమ ఇసుక రవాణా సాగిస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే సాగుతున్నా భద్రాచలం పోలీసు, రెవిన్యూ అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం పట్ల పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రాలో భద్రాచలంకు సమీపంలో ఇసుక ర్యాంపు లేకపోవడంతో అక్రమ ఇసుక వ్యాపారులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. ప్రస్తుతం భద్రాచలం మీదుగా చర్ల మండలం నుంచి ఇసుక లారీలు భారీగా వస్తుండటంతో వాటితో పాటు

మిగతా 2 లో...



# రైతు నేస్తం పురస్కారం అందుకున్న ఆలపాటి రామచంద్ర ప్రసాద్

- పామాయిల్ రైతు కృషికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రశంసలు
- రైతు సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఆలపాటి రామచంద్ర ప్రసాద్ కు ప్రతిష్ఠాత్మక గుర్తింపు - తుమ్మల

**దమ్మపేట, అక్టోబర్ 26 (ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేట మండలానికి చెందిన, తెలంగాణ ఆయిల్ పామ్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ హైదరాబాద్ లోని స్వర్ణ భారతి ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు చేతుల మీదుగా “రైతు నేస్తం” అవార్డును స్వీకరించారు. రైతు సంక్షేమం, ముఖ్యంగా రాష్ట్రంలో

మిగతా 2 లో...

# 21మంది మావోయిస్టులు లొంగుబాటు

- లొంగిపోయిన డివిజన్ కమిటీ కార్యదర్శి ముఖేష్
- లొంగిపోయిన మావోయిస్టుల్లో 13 మంది మహిళలు, ఎనిమిది మంది పురుషులు
- ఆయుధాలు పోలీసులకు అప్పగింత



**చర్ల, అక్టోబర్ 26 (ప్రజాజ్యోతి):** తెలంగాణ చర్ల సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ లోని కాంకేర్ బస్టర్ లో ప్రభుత్వం భద్రతా దళాల చొరవ తో "పునరావాసం ద్వారా పునరుజ్జీవనం" అద్భుతమైన ఫలితాలను ఇస్తూనే ఉంది. ఆదివారం కాంకేర్ జిల్లాలో మొత్తం 21 మంది మావోయిస్టు కార్యకర్తలు తమ ఆయుధాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతి లోకి తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు. ఈ నక్సలైట్లందరూ కేష్కల్ డివిజన్ (నార్త్ సబ్–జోనల్ బ్యూరో) పరిధిలోని కుస్వేమారి కిస్కోడా ఏరియా కమిటీలకు చెందినవారు. లొంగిపోయిన వారిలో డివిజన్ కమిటీ కార్యదర్శి ముఖేష్ కూడా ఉన్నాడు . లొంగిపోయిన 21 మంది మావోయిస్టులలో నలుగురు డివిజన్ వైస్ కమిటీ సభ్యులు (డి వి సి ఎం లు ), తొమ్మిది మంది

మిగతా 2 లో...

# మార్కెట్ గురించి పట్టించుకోరా...

- నిర్దిష్ట స్థానంలో జరగని కొనుగోళ్లు
- ఖాళీ స్థలాల్లో పత్తి కొనుగోళ్ళుకు వెంటాడుతున్న వర్షాలు.



**జూలూరుపాడు అక్టోబర్ 26 ప్రజాజ్యోతి:** అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్టుగా తయారయింది పత్తి మార్కెట్ పరిస్థితి. మార్కెట్కు ఖాళీ స్థలం 9 ఎకరాలు కేటాయించారు మార్కెట్ నిర్మాణానికి 3 కోట్ల 20 లక్షలు మంజూరు అయ్యాయని అధికారికంగా తెలిపినప్పటికీ పత్తి మార్కెట్ నిర్మాణాలు ప్రారంభం కాకపోవడంతో ఒకపక్క వ్యాపారస్తులు మరోపక్క రైతులు ఇంకోపక్క హమాలీలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- **మార్కెట్ పరిస్థితి**

సుమారు 15 సంవత్సరాల నుంచి పత్తి మార్కెట్ ప్రైవేట్ స్థలంలో తీసుకోవడం ద్వారా వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి మినీ గుంటూరు మార్కెట్ గా పేరుపొందిన జూలూరుపాడు పత్తి మార్కెట్ నిత్యం లక్షల్లో వ్యాపారాలు జరుగుతుంటాయి. ఉమ్మడి జిల్లాలు ఏజెన్సీ గ్రామాల నుంచి

మిగతా 2 లో...

## విద్యతోనే కాదు, నైపుణ్యంతోనూ ఎదగాలి.



(మొదటి పేజీ తరువాయి...)

పంచాయతీ పరిధిలోని కోయగట్టు గొత్తికోయ గ్రామాన్ని సందర్శించిన ఆయన,గ్రామీణ ప్రజలతో ముచ్చటించి అభివృద్ధి చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మతో కలిసి గ్రామంలో మట్టితో ఇటికలు సి ఎస్ ఇ బి (కంప్రెస్సెడ్ స్టాబిలైజడ్ ఎర్త్ బ్లాక్) తయారీ విధానాన్ని స్వయంగా ప్రదర్శించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతీ చిన్న పనికీ ప్రభుత్వంపై ఆధారపడకుండా, స్వయం కృషితో ముందుకు సాగాలని గ్రామస్తులను ప్రోత్సహించారు. ఉదయం పూట ఖాళీ సమయాన్ని వినియోగించి,వారు స్వయంగా ఇటుకలు తయారు చేసుకుని గ్రామంలో పాఠశాల భవనం నిర్మాణానికి ఉపయోగించుకోవాలని సూచించారు.అడవుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాని,అటవీ ప్రాంతంలో చెట్లు నరకకుండా ఉపాధి హామీ పథకం ద్వారా ప్రత్యామ్నాయ జీవనాధారాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.ఈ క్రమంలో గ్రామస్తులు చేపల పెంపకం, కౌజు పిట్టల పెంపకం,వెదురు సాగు వంటి ఉపాధి మార్గాలను ఎంచుకుని స్థిరమైన ఆదాయం పొందవచ్చని ఆయన తెలిపారు.భావి తరతరాల అభివృద్ధికి విద్యే పునాది అని పేర్కొంటూ,గ్రామంలోని పిల్లలు చదువులో ముందుకు సాగేందుకు తల్లిదండ్రులు ప్రోత్సాహం ఇవ్వాలని సూచించారు.చదువుకున్న యువతకు ప్రభుత్వం అందించే స్కిల్ డెవలప్మెంట్ శిక్షణలను ఉపయోగించుకుని స్వయం ఉపాధిని సాధించుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి కలిగిన యువతను ఉపాధి అవకాశాలతో కలిపే బాధ్యతను నేను స్వయంగా తీసుకుంటాను అని కలెక్టర్ అన్నారు. గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల చొరవతో పాటు అధికారుల కృషి కూడా అవసరమని ఆయన పేర్కొన్నారు.ప్రజలు,అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రతి గ్రామం అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి,ఎంపీఓ చెన్నకేశవులు,ఏపీఓ పోరండ్ల రంగా, ఆర్ఐ ప్రసాద్,అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్,ఈసీలు రాజు,తిరుపతయ్య, గ్రామ కార్యదర్శులు నారాయణ, ప్రవీణ్ కుమార్, శంకర్, రాములు పాల్గొన్నారు.

## 21మంది మావోయిస్టులు లొంగుబాటు



(మొదటి పేజీ తరువాయి...)

ఏరియా కమిటీ సభ్యులు (ఏ సి ఏం లు) ఎనిమిది మంది పార్టీ సభ్యులు ఉన్నారు. వీరిలో 13 మంది మహిళా క్యాడర్లు ఎనిమిది మంది పురుష క్యాడర్లు ఉన్నారు.లొంగిపోయిన మావోయిస్టులు హింసను విడనాడి సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని ఎంచుకున్నారు. ఈ లొంగుబాటు సమయంలో ఈ నక్సలైట్లు మొత్తం 18 ఆయుధాలను పోలీసులకు అప్పగించారు.వాటిలో మూడు ఏ కె –47 రైఫిల్స్, నాలుగు ఎస్ ఎల్ ఆర్ రైఫిల్స్,రెండు ఐయెన్ఎస్ఏఎస్ రైఫిల్స్, ఆరు .303 రైఫిల్స్, రెండు సింగిల్–షాట్ రైఫిల్స్ ఒక బిజిఎల్ ఆయుధాలు ఉన్నాయి.బస్తర్ పోలీసు అధికారులు ఈ లొంగిపోవడాన్ని "శాంతి వైపు ఒక ప్రధాన అడుగు"గా అభివర్ణించారు. ఈ మార్పు ప్రభుత్వ పునరావాస విధానం అభివృద్ధి ప్రణాళికలు భద్రతా దళాల సున్నితమైన చొరవల ఫలితమని వారు అంటున్నారు. పునరావాసం నుండి పునర్జన్మ వరకు హింసను విడిచిపెట్టి గౌరవప్రదమైన జీవితం వైపు వెళ్ళాలని నిర్ణయించుకున్న వారికి నిజంగా కొత్త ఆశను తెచ్చిపెట్టింది అని అన్నారు .ఈ సామూహిక లొంగుబాటు తో బస్తర్ మారుతోందని మరోసారి రుజువు చేసింది అని తుపాకులకు బదులుగా అభివృద్ధి ప్రతిధ్వనులు ఇప్పుడు వినిపిస్తున్నాయి అని లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ పునరావాస విధానం ప్రకారం ఆర్థిక సాయం శిక్షణ ఉపాధి అవకాశాలు అందించబడతాయని అధికారులు తెలియజేశారు .

# మార్కెట్ గురించి పట్టించుకోరా...

(మొదటి పేజీ తరువాయి...)

సైతం పత్తి విక్రయించడానికి వస్తుంటారు ఇక్కడ పత్తి కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు ఇవ్వడం జరుగుతుంది కాబట్టి మార్కెట్కు తీసుకురావడానికి రైతులు ఆసక్తి కనబరుస్తుంటారు.

- **లైసెన్స్ కలిగిన బయర్లుతో పాటు వెయ్యి మంది వరకు హమాలీలు**

పత్తి మార్కెట్లో సుమారు 15 మంది లైసెన్స్ కలిగి అనుభవం కలిగి ఉన్న బయర్లు ఉన్నారు . సుమారు వెయ్యి మంది వరకు ఈ మార్కెట్లో హమాలీలు పని చేస్తూ ఉంటారు పత్తిని కొనుగోలు చేసిన వెంటనే డబ్బులు చెల్లించడంతో పత్తి మార్కెట్లో వ్యాపార బిజీగా జరుగుతుంటాయి రోజు కోట్లల్లో వ్యాపారం జరుగుతా ఉంటుంది. ధర కూడా రైతుకు ఆశించిన విధంగా వ్యాపారస్తులు పెట్టడంతో మార్కెట్కు రైతులు వచ్చేందుకు మొగ్గు చూపుతూ ఉంటారు.

- **ఆదాయం**

జూలూరుపాడు పత్తి మార్కెట్ కు ఆదాయం కోట్లల్లో వస్తుంది ఖమ్మం జిల్లాలోని ఏన్కూరు వ్యవసాయ మార్కెట్ కు జమ చేస్తూ ఉంటారు మార్కెట్కు కావాల్సిన కనీస అవసరాలు కూడా తీర్చలేని పరిస్థితి ఏర్పడింది ప్రతి సంవత్సరం వ్యాపారస్తులు పత్తి మార్కెట్కు కావాల్సిన స్థలాన్ని అద్దెకు తీసుకొని డబ్బులు చెల్లిస్తూ ఉంటారు మార్కెట్కు వచ్చే ఆదాయం మాత్రం ఖమ్మం జిల్లాకు వెళుతూ ఉంటుంది.





రైతు బానోత్ ధర్మ



హమాలీ పత్తిపాటి మహేష్

- **కనీస అవసరాలు కూడా తీర్చలేని పరిస్థితి**

మార్కెట్కు కోట్లల్లో ఆదాయం ఉన్నప్పటికీ మార్కెట్లో వ్యాపారస్తుల కానీ హమాలీలకు కానీ కనీస అవసరాలు తీర్చలేని పరిస్థితి జూలూరుపాడు మార్కెట్లో ఉంది కూలీలకు సంబంధించి విశ్రాంతి గదులు కానీ వాష్రూములు కానీ మంచి నీటి సౌకర్యం కానీ ఉండదు ఒకవేళ ఏదైనా అకాలముగా వర్షాలు వచ్చినప్పటికీ పత్తిని తడవకుండా కాపాడాలంటే వ్యాపారస్తులు ఇబ్బందులు పడాల్సిందే. అంతేకాక అనుకోని ప్రమాదాలు జరిగినప్పటికీ అగ్నికి సంబంధించిన పరికరాలు కానీ కూలీలకు అత్యవసర చికిత్సలు కానీ తరలించేందుకు వాహనాలు కాని ఉండవు హమాలీల భవిష్యత్తు ఇక్కడ ప్రశ్నార్థకంగానే ఉంటుంది. అయితే ప్రభుత్వాలు మారినప్పటికీ ఇక్కడ మార్కెట్ యార్డ్ పరిస్థితి మాత్రం మారడం లేదు పది ఎకరాల స్థలం కేటాయించి మార్కెట్ యార్డ్ అధికారులకు స్వాధీనం చేసినప్పటికీ డబ్బులు కూడా సుమారు మూడు కోట్ల 20 లక్షలు మంజూరైనప్పటికీ నిర్మాణం పనులు మాత్రం ఆరంభానికి నోచుకోలేదు ఒక వైపు పత్తి అమ్మటానికి రైతులు మార్కెట్కు వస్తున్నప్పటికీ కొనుగోలు ప్రాణ సంఘటనగా మారింది వ్యాపారస్తులు ఎక్కడ పత్తి కొనుగోలు చేయాలనేది ప్రశ్నార్థకంగా మారింది ఏదో ఖాళీ స్థలంలో పట్టాలు వేసి కొనుగోలు చేస్తున్నప్పటికీ వర్షాలు మాత్రం వెంటాడుతూనే ఉన్నాయి. పత్తి ఎక్కడ కొనుగోలు చేయాలని వ్యాపారస్తులు, ఎక్కడ కొనుగోలు చేస్తారో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.. అకాల వర్షాలు పత్తి రైతులను మాత్రం నిలువునా ముంచాయి ఒకవైపు గిట్టుబాటు ధర లేక లబోదిబోమంటున్నారు. పత్తి పొలాలు తడవనంతో కూలీలు సైతం తీయడానికి అధిక రేట్లు వసూలు చేస్తున్నారు. పత్తిని తీయించక తప్పడం లేదు మరోపక్క కూలీల కొరతతో పత్తి తీతకు వచ్చిన వర్షాలకు చెట్లపైనే తడిచి కారిపోతుంది. తడిచిన పత్తిని మార్కెట్ కి తెస్తున్నారంటూ వ్యాపారస్తులు ధరలలో కోతలు విధిస్తున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం మార్కెట్ యార్డ్ ను త్వరగా నిర్మాణం చేపట్టి అటు వ్యాపారస్తులకు ఇటు హమాలీలకు పత్తి రైతులకు సైతం వీముక్తి కలిగించాలని ముక్తకంఠంతో కోరుతున్నారు

## కోట్ల రూపాయాల ఆదాయంకు గండి

(మొదటి పేజీ తరువాయి...)

ఈ లారీలను సైతం భద్రాచలం పరిసర ప్రాంతాల్లో నడుపుతున్నారు. భద్రాచలం పోలీసులు సైతం కొన్నిసార్లు నామమాత్రంగా లారీలను పట్టుకొని, రోజువారీగా తిరిగే లారీలను మాత్రం వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలా ఆంధ్రాలో అక్రమ ఇసుకను తెలంగాణలో జోరుగా దందా కొనసాగిస్తూ కోట్ల రూపాయలు ఆర్జిస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. ఒక్కొక్క ఇసుక ట్రాక్టర్ కు రూ.5 నుంచి 3 వేలు, లారీ, టిప్పర్ అయితే రూ.20 వేల వరకు విక్రయిస్తూ తెలంగాణలోని టీజీఎండీసీ ద్వారా జరిగే ఇసుక వ్యాపారంకు కోట్ల రూపాయాల ఆదాయంకు గండి కొడుతున్నారు. భద్రాచలంలో భారీగా భవనాల నిర్మాణాలు కొనసాగుతుండటంతో అక్రమ ఇసుక వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. కాగా మూడు రోజుల క్రితం ఏపీలోని గుండాల నుంచి వస్తున్న అక్రమ ఇసుక ట్రాక్టర్ ఓ ద్విచక్ర వాహనదారుడిని ఢీకొట్టడంతో తృటిలో ప్రాణపాయం నుంచి తప్పిగా ఓ వైద్యశాలలో చికిత్స అందించారు.

### ఇండస్ట్రియల్ ఏరియాలో అక్రమ మట్టి, ఇసుకకు ప్రత్యేక స్టాక్ పాయింట్

భద్రాచలంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో అక్రమ మట్టి, ఇసుక తోలకాలకు ప్రత్యేక స్టాక్ పాయింట్ ను ఏర్పాటు చేసుకొని మరీ ఆక్రమ వ్యాపారం సాగిస్తున్నారు. బూర్గంపాడు మండలంలో కొందరు లారీ నిర్వాహకులు భద్రాచలంలో ఆక్రమ ఇసుక వ్యాపారం చేసే వారితో చేతులు కలిపి ఈ దందాకు తెరలేపారు. భద్రాచలంలోని ఇండస్ట్రియల్ ఏరియా శివారున ఉన్న ఖాళీ స్థలంలో అక్రమ, మట్టి ఇసుక తోలకాలకు స్టాక్పాయింట్ ఏర్పాటు చేసి రాకపోకలు సాగిస్తున్నారు. బూర్గంపాడు మండలంలోని సీతారామ ప్రాజెక్టుకు తోడిన మట్టిని అక్కడి రెవిన్యూ అధికారుల అనుమతి లేకుండానే యధేచ్చగా లారీల్లో భద్రాచలం తరలిస్తున్నారు. ఇంత బహిరంగంగా ఇసుక, మట్టి తోలకాలు జరుగుతున్నా భద్రాచలం రెవిన్యూ అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుండటం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఇకనైనా రెవిన్యూ అధికారులు స్పందించి అక్రమ స్టాక్ పాయింట్ పై దాడి చేయడంతో పాటు అక్రమ ఇసుక, మట్టి తోలకాలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## రైతు నేస్తం పురస్కారం అందుకున్న ఆలపాటి రామచంద్ర ప్రసాద్

(మొదటి పేజీ తరువాయి...)



పామాయిల్ సాగు విస్తరణకు ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం దక్కింది.

- **రైతాంగానికి మార్గదర్శిగా నిలుస్తున్న ఆలపాటి – వెంకయ్య నాయుడు**

ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ —"పామాయిల్ రైతుగా ఉంటూనే, రైతాంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న ఆలపాటి రామచంద్ర ప్రసాద్ సేవలు అభినందనీయమైనవి.రైతుల శ్రేయస్సు కోసం నిరంతరం పనిచేసే వారిని సత్కరించడం ఆనందకరం. రైతాంగం అభివృద్ధి చెందితే దేశం అభివృద్ధి చెందుతుంది" అని అన్నారు.

- **ఆయిల్ పామ్ సాగు విస్తరణలో ఆలపాటి కృషి విశేషం – మంత్రి తుమ్మల**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆలపాటి రామచంద్ర ప్రసాద్ రాష్ట్రంలో పామాయిల్ సాగు విస్తరణకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారు.రైతుల సమస్యలపై ప్రభుత్వానికి సూచనలు ఇస్తూ, రైతు సంఘాలను బలోపేతం చేస్తున్నారు.ఆయన కృషికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొయ్యల అచ్యుతరావు, సత్యంబాబు తదితరులు పాల్గొన్నారు.తమ ప్రాంత రైతు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ కు రైతు నేస్తం" అవార్డు లభించడంతోదమ్మపేట మండల పామాయిల్ రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# తెలంగాణ రాష్ట్ర నాలుగో మహాసభలను విజయవంతం చేయాలి.

- విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి మానుకోవాలి.
- వనపర్తిలో జరిగే రాష్ట్ర 4 వ మహాసభ ను విజయవంతం చేయండి
- పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి
- విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించాలి
- పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్




**టేకులపల్లి, అక్టోబర్26, ప్రజాజ్యోతి:** ఈనెల 28 29 30న జరిగే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి అని పిడిఎస్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గణేష్పిలుపునిచ్చారు.ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1972లో ఉస్మానియావిశ్వవిద్యాలయంలో అరాచకాలకు,ర్యాగింగ్,కుల వివక్షతకు వ్యతిరేకంగా నిలిచి పోరాడిన ఉస్మానియా అరుణతార జార్జిరెడ్డి, తన మిత్ర బృందంతో ఏర్పడిన ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో లక్షలాది మంది పేద విద్యార్థులకు అండగా నిలిచిందన్నారు.శాస్త్రీయ విద్యా సాధనకై, సమసమాజ స్థాపన కై ముందు కదులుతూ విద్యారంగ సమస్యల పరిష్కారం కొరకు పోరాడుతూ అనేకమంది విద్యార్థులు తమ ప్రాణాలను ప్రగతిశీల విద్యార్థి ఉద్యమం కొరకు ప్రాణ త్యాగం చేశారన్నారు. వారి త్యాగంతో ఎరుపెక్కిన బిగిపిడికిలి జెండా నేటికీ విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలను నిర్వహిస్తూనే ఉందన్నారు. ఈ క్రమంలోనే గత ఉద్యమాల సమీక్షకై, నూతన కర్తవ్యాలకై రాష్ట్ర మహాసభలను వనపర్తి జిల్లా కేంద్రంలో అక్టోబర్ 28, 29, 30వ తేదీలలో జరుపుకోబోతున్నదని ఆయన తెలిపారు. అందులో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం రాష్ట్ర నాలుగవ మహాసభలను వనపర్తి జిల్లా కేంద్రంలో28 .29.30. తేదీలలో కార్యవర్గం నిర్వహించుకోబోతున్నదన్నారు. రాష్ట్రంలో విద్యారంగానికి మంత్రినికేటాయించే పరిస్థితి కనబడటం లేదని అని ఆరోపించారు.రాష్ట్రంలో విద్యార్థులకు అందాల్సిన స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్మెంట్ నేటికీ నాలుగు సంవత్సరాల నుండి పెండింగ్ లోనే ఉన్నాయ న్నారు.గురుకులాలలో విష ఆహారం విద్యార్థులు మరణాల పాలవుతున్నారని,సంక్షేమ హాస్టల్స్, ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యలకు నిలయంగా మారాయన్నారు. సమస్య ఉత్పన్న మైయినప్పుడు మాత్రమే అధికారులు విద్యాలయాలను పర్యవేక్షించడం తప్ప పరిష్కరించిన పాపాన ఏ అధికారి, పాలకులు గాని లేరన్నారు. నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ స్కూల్ అని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం దానిని హామీకే పరిమితం చేసిందని, విద్యారంగా అభివృద్ధిలో గిరిజన ప్రాంతం అయినా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంపదను తరలించు కోవడమే తప్ప ఇక్కడ యువతకు ఉపాధి కల్పించే ఆలోచనలోనే పాలకులు లేరన్నారు.రాష్ట్ర నాలుగవ మహాసభ జిల్లా విద్యార్థులు అదేవిధంగా మేధావులు, కార్మికులు, కర్షకులు అన్ని వర్గాల ప్రజలు తమ సంపూర్ణ మద్దతును తెలియజేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు.ఈ కార్య క్రమంలో మండల నాయకులు బి.భాను ప్రసాద్. ఎ.సాయి కుమార్, బి. ప్రశాంత్. వి.అరవింద్,వి.మహేష్ నవీన్. కె. కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

## అంబేద్కర్ ఆశయాలు విద్యతోనే సాధ్యం

- ఉచిత విద్య అందిస్తున్న బృహస్పతి మరువలేము
- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘన సన్మానం





**పినపాక,అక్టోబర్ 26(ప్రజాజ్యోతి ):** పినపాక నియోజకవర్గంలో అంబేద్కర్ ఆశయాల సారధి శ్రీరామ్ బృహస్పతి అని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు వల్లెపోగు వెంకటేశ్వర్లు , తిరుపతి, ఇనుముల వెంకటేశ్వర్లు, అంబేద్కర్ వాది కత్తి బాలకృష్ణ అన్నారు. ఆదివారం పినపాక మండలం సీతారాంపురం గ్రామంలో ఏర్పాటు చేసిన శ్రీ ఎస్బి ఉచిత లైబ్రరీ, కోచింగ్ సెంటర్ వద్ద ఆయనను ఘన సన్మానం చేశారు. పేద విద్యార్థులకు ఉచితంగా లైబ్రరీ ఏర్పాటు చేయడమే కాకుండా, స్టడీ రూమ్ , కంప్యూటర్ ఎడ్యుకేషన్ సైతం ఉచితంగా అందజేయడం అభినందనీయమని కొనియాడారు. బీసీ బిడ్డగా దళిత, గిరిజన బహుజనుల బాధలను, కష్టాలను పత్రిక అధికారులకు తెలియజేస్తూ , ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్న ఆయనను సన్మానించడం గర్వంగా ఉందన్నారు . వందలాది మంది విద్యార్థులకు ఉచిత విద్య అందిస్తున్న ఆయన సేవలను గుర్తించడం గర్వకారణంగా ఉందన్నారు. ఒక్క రూపాయి కూడా ఎవరి దగ్గర ఆశించకుండా తన ఆదాయం మొత్తం పేదల చదువుల కోసం వినియోగించడం నేటి కాలంలో ఇలాంటి వ్యక్తులు ఉండటం చాలా గర్వకారణం అన్నారు. బహుజన బిడ్డలు ఈ ఉచిత లైబ్రరీ, ఉచిత స్టడీ రూమ్ ఉపయోగించుకొని ఉన్నత స్థానాలకు రావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తేగటి నరసింహారావు,మహమ్మద్ అజ్మీయా, తదితరులు పాల్గొన్నారు.

## మండల అధ్యక్షుడు మంగీలాల్ త్వరగా కోలుకోవాలి

- యాక్సిడెంట్లో గాయాలై విశ్రాంతి తీసుకుంటున్న మండల అధ్యక్షుడు



**జూలూరుపాడు అక్టోబర్ 26 ప్రజాజ్యోతి:** మండల అధ్యక్షుడు మాలోత్ మంగీలాల్ నాయక్ గత వారం క్రితం మోటార్ సైకిల్ పై వెళుతూ కింద పడ్డారు ఈ క్రమంలో గాయాలయి ఇంటి వద్ద చికిత్స పొందుతున్నారు విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆదివారం మంగీలా స్వగ్రామం గంగారం తండా వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా యాక్సిడెంట్ ఎలా జరిగిందో ఆరా తీసి చికిత్స జరుగుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు లేళ్ళవెంకటరెడ్డి, పొన్నెకంటి సతీష్, అల్లాడి నరసింహారావు, దుద్దుకూరు సుమంత్,వేల్పుల నరసింహారావు,ఆర్కే నాయుడు లచ్చు నాయక్,కొరసా రమేష్ వుసికల వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## పాల్వంచలో అర్ధరాత్రి వాహనాల తనిఖీలు..

- మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసుల దృష్టి..




**పాల్వంచ(రూరల్), అక్టోబర్ 26,(ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో పోలీసులు క్షుణ్ణంగా వాహన తనిఖీలు చేపట్టారు.డీఎస్పీ సతీష్ కుమార్,సీఐ సతీష్ కుమార్ పర్యవేక్షణలో పాల్వంచ టౌన్ పోలీసు బృందం కె ఎస్ ఎం బంక్ సమీపంలో వాహనాలను ఆపి సోదాలు నిర్వహించారు.మాదక ద్రవ్యాలు,గంజాయి అక్రమ రవాణాపై నియంత్రణకలో భాగంగా ఈ తనిఖీలు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సుమన్, జీవన్ రాజ్,కళ్యాణితో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.పాల్వంచ పరిధిలో ఇలాంటి తనిఖీలు తరచుగా నిర్వహించి,అక్రమ రవాణా మరియు చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని తెలిపారు..




## టేకులపల్లిలో బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ




**టేకులపల్లి, అక్టోబర్ 26,ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర బిఆర్ఎస్ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు జిల్లా అధ్యక్షులు రేగా కాంతా రావు,ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ ల సూచనలతో ఆదివారం టేకులపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బొమ్మెర్ల వరప్రసాద్ ఆధ్వర్యంలో 36 గ్రామపంచాయతీలో పార్టీ జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వంలో సుభిక్షంగా ఉన్న గ్రామాలు నేడు అవినీతిలో కూరుకుపోయాయని,స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వస్తాయా ఎప్పుడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్దామా అని గ్రామాల్లో ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మండలంలోని గ్రామాలని సుందరంగా తీర్చిదిద్దాలనే ఒక మంచి ఆలోచనతో మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి 3కోట్లతో సెంట్రల్ లైటింగ్ పనులు మంజూరు చేయించి పనులను త్వర త్వరగా పూర్తి చేశారు అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బోడ బాలు నాయక్,ఎక్స్ ఎంపీటీసీ అప్పారావు,బాలకృష్ణ,మండల నాయకులు టీ. రవి,భూక్యా లాలునాయక్,బానోత్ రామ నాయక్, రేణుక, లక్పతి, నానబల భిక్షం,బోడ రమేష్, బి.ప్రసాద్, కే.రామ్ కుమార్, మూడ్ రాజ్ కుమార్,మూడ్ హుస్సేన్,మూడ్ బాలు, బానోత్ బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు

## పెద్దమ్మతల్లి దర్శనానికి భక్తుల రద్దీ

**పాల్వంచ(రూరల్), అక్టోబర్ 26(ప్రజా జ్యోతి):** కేశవాపురం–జగన్నాథపురం గ్రామాల మధ్యనున్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి) ఆదివారం భక్తులతో కిటకిటలాడింది.పరిసర గ్రామాలు,ఇతర జిల్లాల నుంచి భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.కార్తీకమాసం సందర్భంగా అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామివారికి అభిషేకాలు, బోనాలు, మొక్కులు నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం పులిహోర ప్రసాదం, నీటి వసతి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు కల్పించినట్లు దేవస్థాన ఈఓ ఎన్. రజనీకుమారి తెలిపారు.





## ప్రజలకు అండ..గులాబీ జెండా..

- బిఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు



**చర్ల, అక్టోబర్ 26: (ప్రజాజ్యోతి ):** తెలంగాణ లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు దృష్టిలో ఉంచుకొని బిఆర్ఎస్ కేంద్ర పార్టీ ఆదేశాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు ఆదేశాల ప్రకారం చర్ల బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో ఆదివారం బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయం వద్ద గులాబీ జెండాను ఎగరవేయడం జరిగింది.ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో గులాబీ జెండా రెపరెపలాడడం ఖాయమని ,6 గ్యారంటీలతో 420 హామీలతో ప్రజలను మోసం చేసిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు .ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు పూర్తి అయినా ఇచ్చిన హామీలు నేరవేర్చలేదని గ్రామాలలో ఎక్కడి చెత్త అక్కడే ఉండి పారిశుద్యం కుంటు పడిందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని అన్నారు .ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు సోయం రాజారావు, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, జనసరాసీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, దొడ్డి సూరిబాబు , దినసరపు భాస్కర్ రెడ్డి, అంకాల శ్రీనివాసరావు, కాకి అనిల్, పంజా రాజు, తడికల బుల్లబ్బాయి, గోరింట్ల వెంకటేశ్వరరావు, గోసుల నరసింహారావు , రాట్నాల శ్రీరామ్మూర్తి, ఎడ్ల రాందాస్ ,సాంబశివరావు ,ఆర్.ఎం.పి రాజు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందే



**ఇల్లందు, అక్టోబర్ 26, ప్రజాజ్యోతి:** బీసీ కులస్తులకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని ముదిరాజ్ సంఘం నాయకులు భోళ్ళ సూర్యం, సారయ్య, గందె సదానందం లు అన్నారు. ఆదివారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ ఇల్లందులో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా జనాభా కలిగిన బీసీలకు పాలక ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రంగాలలో బీసీలకు సమన్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకన్న, పురుషోత్తం, బండి రాజయ్య, పెండ్యాల రాజు, సదానందం, సీతారాములు, సమ్మయ్య, వెంకట్ , ఉపేందర్, కుంట నవాబ్, శీలం రమేష్, సదయ్య, నగేష్, సరిత, మమతా, కళావతి, స్వరూప, కృష్ణవేణి, సమ్మయ్య పాల్గొన్నారు.

## ఎంఎంసీ కాలనీ శివారులో ఉన్న డ్రైను నిర్మాణంకు నిధులు కేటాయించాలి

- 13వ వార్డులో సీపీఎం పాదయాత్ర



**భద్రాచలం, అక్టోబరు 28, ప్రజాజ్యోతి :** పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థపై గ్రామ పంచాయతీకి సమగ్ర ప్రణాళిక లేదని సీపీఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి విమర్శించారు. ఆదివారం ఎంఎంసీ కాలనీ లో పాదయాత్ర సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. శిధిలావస్థకు చేరిన డ్రైనేజీ ఎప్పుడు కడతారో చెప్పాలని డిమాండ్ చేశారు. పేదల నివాసం ఉంటున్న ప్రాంతాలకు గ్రామ పంచాయతీ నుంచి నిధులు కేటాయించడంలో వివక్షత చూపుతున్నారని ఇది సరైంది కాదని అన్నారు. పంచాయతీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ పట్ల సమగ్రమైన ప్రణాళిక అధికారులకు లేదని తక్షణమే ప్రణాళిక రూపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సున్నం గంగ, వై.వెంకటరామారావు, జీవనజ్యోతి, అజయ్కుమార్, కనకశ్రీ, కాపుల దుర్గారావు, జి. నాగలక్ష్మి, సీత, గోవర్ధన్, ఝాన్సీ, –గౌతమి, వై.పూర్ణిమ పాల్గొన్నారు.

# కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా మెగా జాబ్ మేళా

- - ముఖ్య అతిథులుగా సింగరేణి డైరెక్టర్, ఎమ్మెల్యే, ఎంపీ లు..



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 26 – ప్రజాజ్యోతి:** సింగరేణి కార్పొరేట్ సామాజిక బాధ్యతలు భాగంగా నిరుద్యోగ యువతకు మెగా జాబ్ మేళా ను కొత్తగూడెం ఏరియా ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం సత్తుపల్లి లోని రాణి సెలబ్రేషన్స్ ఫంక్షన్ హాల్ మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్, విశిష్ట అతిథులుగా ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంపీ రామసహాయం రఘురామ రెడ్డి, సింగరేణి సంస్థ డైరెక్టర్ (ఈ అండ్ ఎం) టి. తిరుమల రావు, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం షాలేం రాజు పాల్గొన్నారు. ముందుగా ఈ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలను వెలిగించి అనంతరం ముఖ్య అతిథులు విశిష్ట అతిథులు చేతులు మీదుగా సింగరేణి ఆధ్వర్యంలో సత్తుపల్లిలో ఆదివారం అక్టోబర్ 26వ తేదీన నిర్వహించిన మెగా జాబ్ మేళా కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు విశిష్టత అతిథులతో కలిసి కంపెనీ హెచ్ ఆర్ స్టాల్స్ ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా హాజరైన సత్తుపల్లి ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ మెగా జాబ్ మేళా ను ఇంత ఘనంగా నిర్వహించుటకు సహకరించిన సింగరేణి సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు మరీ ముఖ్యంగా ఈ జాబ్ మేళా నిర్వహణకు సహకరించిన సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. అలాగే నిరుద్యోగ యువత కలల సాకారమే మా ప్రభుత్వ లక్ష్యం అని యువతకు ఉపాధి చూపించడం కోసం జాబ్ మేళాల నిర్వహిస్తున్నామని, రానున్న రోజుల్లో మరిన్ని ఉద్యోగాల అవకాశాలను కల్పించడం కొరకు కృషి చేస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాల కనుగుణంగా ప్రభుత్వ సంస్థ సింగరేణి సహకారంతో యువతకి ఉపాధి కల్పించేందుకు సత్తుపల్లి లో నిర్వహించిన ఈ జాబ్ మేళా కోసం హైదరాబాదు నుంచి 66 ప్రైవేట్ సంస్థలని ఇక్కడికి రప్పించిన సింగరేణి యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నేటి ఆధునిక కాలంలో యువత ప్రపంచంలో ఏ మూలన ఉద్యోగ అవకాశాలు ఉన్నా సరే వాటిని అందిపుచ్చుకోవాలని, కేవలం స్థానికంగానే ఉపాధి కోసం ప్రయత్నిస్తే అవకాశాలు తక్కువగా ఉంటాయని వారు పేర్కొన్నారు. సింగరేణి సహకారంతో రానున్న రోజుల్లో నగరంలో పలు కీలక మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు .ప్రతి నిరుద్యోగి కూడా తమకు వచ్చిన అవకాశం వినియోగించుకుంటూ అంచెలంచెలుగా ఎదగాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని అభిలాషించారు . ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంపీ రామసహాయం రఘురామ రెడ్డి ఇంత చక్కగా ఆర్గనైజ్ చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే తో పాటు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ లకు అభినందనలు తెలియజేశారు. అలాగే నిరుద్యోగ యువత ఈ యొక్క అవకాశాలను సద్వినియోగపరచుకొని వారి యొక్క కుటుంబాలకు ఆర్థిక లబ్ధిని చేకూర్చుకునే విధంగా చూసుకోవాలని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు రేవంత్ రెడ్డి,ఉపముఖ్యమంత్రి వర్యులు భట్టి విక్రమార్క మల్లు నేతృత్వంలో యువత ఉద్యోగ నియామకాల తో పాటు రాజీవ్ యువ వికాసం, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు ద్వారా నైపుణ్యాల ను పెంపొందిస్తూ, ఉపాధి కల్పనకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి సంస్థ డైరెక్టర్ (ఈ&ఎం) టి. తిరుమల రావు మాట్లాడుతూ... ఈ జాబ్ మేళా నిర్వహణను సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం దిశ నిర్దేశాలతో ఈ కార్యక్రమం ను ఇంత చక్కగా నిర్వహించుకుంటున్నామని అన్నారు.ఈ జాబ్ మేళా నిర్వాహన కు ముఖ్య కారణం అని ఉద్యోగం లేని యువతకు సమాజంలో చిన్న చూపు ఉంటుందని, దాన్ని దూరం చేసి వారిలో ఆత్మవిశ్వాసం నింపేందుకు జాబ్ మేళా లను ఏర్పాటు చేసినట్లు వివరించారు . కొత్తగూడెం ఏరియా జిఎం షాలేం రాజు మాట్లాడుతూ... ఈ జాబ్ మేళా నిర్వాహణ కు ముఖ్య కారణం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్ విజయకుమార్ అని, వారు అడిగిన వెంటనే కార్పొరేట్ సామాజిక బాధ్యత లో భాగంగా కేటాయించిన నిధులతో ఈ జాబ్ మేళా ను నిర్వహిస్తున్నామని ఈ జాబ్ మేళా వలన అనేక కుటుంబాలకు ఆర్థికలాబ్ధి చేకూరుతుందని మరి ముఖ్యంగా ఈ జాబ్ మేళాలో ఎటువంటి ప్రీవియస్ ఎక్స్పీరియన్స్ తో పని లేకుండా అందరికి ఉద్యోగ అవకాశం కల్పిస్తున్నామని అలాగే నిరుద్యోగ యువతకు వారి ఆసక్తిని బట్టి వివిధ స్థానిక మరియు సుదూర ప్రాంతాలలో కూడా ఉద్యోగ అవకాశాలను కల్పించడం జరిగిందని అన్నారు. మొత్తం 11,500 మంది 72 కంపెనీ ల కొరకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోగా ఆఫ్ లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా 2,818 మంది చేసుకొని మొత్తంగా 14,318 మంది నిరుద్యోగ యువత చేసుకోగా అందులో 4,611 మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. జాబ్ మేళాలో ఉద్యోగాలు పొందిన వారికి ముఖ్య అతిథులు, విశిష్టాధితులు నియామక పత్రాలు అందజేశారు .హైదరాబాద్ కంపెనీలను సత్తుపల్లికి తీసుకువచ్చి తమ పిల్లలకి ఉద్యోగ అవకాశాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి సింగరేణి యాజమాన్యానికి స్థానికులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జిఎం జీవి.కోటిరెడ్డి, డిజిఎం (పర్సనల్) జీవి మోహన్ రావు, ప్రాజెక్ట్ ఆఫీసర్స్ ఎన్విఆర్ ప్రహ్లాద్, ఎం.వి. నరసింహారావు, ఇతర సంబంధిత అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ లో సూపర్ స్పెషాలిటీ హెల్త్ క్యాంప్





- - 135 మంది రోగులకు పరీక్షలు
- - కార్డియాలజీ, న్యూరో, గ్యాస్ట్రో, యురాలాజీ తదితర విభాగాల్లో సేవలు

**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 26 – ప్రజాజ్యోతి:** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆదివారం కొత్తగూడెం మెయిన్ హాస్పిటల్ నందు సూపర్ స్పెషాలిటీ హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించబడింది. కార్డియాలజీ & న్యూరాలజీ – నిఖిల్ హాస్పిటల్ ,హైదరాబాద్ , న్యూరాలజీ, యురాలజి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ –డెక్కన్ హాస్పిటల్ నిపుణ వైద్యులు ఈ క్యాంప్ లో సేవలు అందించారు. సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు , పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో ఈ క్యాంప్ లో పాల్గొన్నారు. మొత్తం 135 మంది రోగులు ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. విభాగాల వారీగా రోగుల సంఖ్య కార్డియాలజీ :41, గ్యాస్ట్రో ఎంట్రాలజీ :31, న్యూరాలజీ:40, యూరాలజీ : 23 మొత్తం 1 – 135 మందికి వైద్య సేవలు చేసారు. ఈ హెల్త్ క్యాంప్ ను చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ యన్. బలరాం ఆదేశాల మేరకు, డైరెక్టర్ (పా) గౌతమ్ పొట్రు సలహా, చీఫ్ మెడికల్ ఆఫీసర్ కిరణ్ రాజ్ కుమార్ సూచనలతో ఏర్పాటు చేశారు. అడిషనల్ సీఎంవో ఉష పర్యవేక్షణలో ఈ సూపర్ స్పెషాలిటీ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైకియాట్రిస్ట్ డాక్టర్ విశ్వమేది, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ పి.బి. అవినాష్, మెయిన్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కపిలవాయి దిలీప్ కుమార్ కార్నర్ మీటింగ్ ను జయప్రదం చేయండి

- రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కట్ట సతీశ్



**కొత్తగూడెం, అక్టోబర్ 26 (ప్రజా జ్యోతి):** ఎన్నికల హామీల అమలులో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తు రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ చేపట్టిన సామాజిక చైతన్య రథయాత్ర మంగళవారం కొత్తగూడెం చేరుకోనున్నట్టు రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు కట్టా సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుదుతు స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు, తెలంగాణ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య పరిష్కారానికై 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ, నిరుద్యోగ భృతి బకాయిల చెల్లింపు, యువత రాజకీయంలోకి రావాలి తెలంగాణను ఏలుకోవాలనే లక్ష్యంతో రాష్ట్రీయ లోక్ దళ్ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ చేపట్టిన సామాజిక చైతన్య రథయాత్ర 28 మంగళవారం ఉదయం 11 గంటలకు కొత్తగూడెం రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కర్నార్ మీటింగ్ ను విజయవంతం చేయాలని రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షులు కట్టా సతీష్ పిలుపునిచ్చారు.

# జనక్ ప్రసాద్ కుమారుని వివాహ వేడుకలో పాల్గొన్న రజాక్



**కొత్తగూడెం సింగరేణి, అక్టోబర్ 26 – (ప్రజాజ్యోతి):** ఐఎన్టీయుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, బీనాదేవి దంపతుల కనిష్ట పుత్రుడు అనుదీవ్ వివాహం ప్రియాంక తో పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ఆర్ ఆర్ గార్డెన్స్ ఫంక్షన్ హాల్ నందు జరిగిన వివాహ కార్యక్రమానికి కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఎం.డీ రజాక్ ఆధ్వర్యంలో కొత్తగూడెం ఏరియా మైన్స్, ఓపెన్ కాస్ట్, డిపార్టుమెంట్ ల లోని ఐఎన్టీయుసి నాయకులు సెంట్రల్ కమిటీ మెంబర్స్, బ్రాంచి కమిటీ మెంబర్స్, ట్రెజరర్, ఆర్గనైజింగ్ సెక్రటరీస్, ఫిట్ సెక్రటరీలు, ఆల్ కమిటీ మెంబర్స్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ వారి వివాహ జీవితం సుఖ సంతోషాలతో సాగాలని నూతన దంపతులను ఆశీర్వదించడం జరిగినది.ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ ఎండీ రజాక్, అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ బుటిక రాజేశ్వరరావు, సకినాల సమ్మయ్య, జీదుల రాజేశ్వరావు, తీగల క్రాంతి కుమార్, సైమన్, మల్లారపు కొమరయ్య, కాసర్ల సమ్మయ్య, రామారావు, చిలక రాజయ్య, మల్లికార్జున్,డి.శంకర్ బాబు, వై శంకర్రావు, భానుకమల్, లెనిన్, రఫి, వెంకటస్వామి, సాంబశివరావు, కోలుగూరి శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, నవీన్, శ్రీనివాస్, క్రాంతికుమార్,పవన్, రాజయ్య, నాయకులు, కార్యకర్తలు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ పుష్పార్చన, అభిషేకం

- నేడు ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతాలు



**భద్రాచలం, అక్టోబరు 28,(ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో ఆదివారం సందర్భంగా భద్రాద్రి రామయ్యకు అంతరాలయంలో ఆర్జిత సేవలో భాగంగా ప్రత్యేక అభిషేకం, స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనను వైదిక సిబ్బంది నిర్వహించారు. అలాగే రామాలయంలో నేడు కార్తీక సోమవారం సందర్భంగా సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నారు. ఈ వ్రతాల్లో పాల్గొనే దంపతులు రూ.500 చెల్లించి చిత్రకూట మండపంలో జరిగే వ్రతాల్లో పాల్గొనవచ్చు. ఈ వ్రతంలో పాల్గొనే వారికి పూజా సామాగ్రిని దేవస్థానంమే సమకూరుస్తుంది. అలాగే స్వామి వారి దర్శనం, అన్నప్రసాదం అందజేస్తారు.

# మెడికల్ సీటు సాధించిన భద్రాద్రి విద్యార్థినిని అభినందించిన కేటీఆర్



**భద్రాచలం, అక్టోబరు 26,(ప్రజాజ్యోతి :** నీట్ పరీక్షల్లో మెరిట్ సాధించి మైనార్టీ కోటాలో ఎంబీబీఎస్ సీటు సాధించిన భద్రాచలంకు చెందిన గాలి అచ్యుత్ స్వరూప దంపతుల కుమార్తె అనూష ఆదివారం హైదరాబాద్ లో తెలంగాణ భవన్ లో జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు,రాష్ట్ర నాయకులు హరీష్రావులు అభినందించారు. బూర్గంపాడు మైనార్టీ కళాశాలలో ఇంటర్ చదివిన అనూష నీట్ పరీక్షల్లో ప్రతిభ చాటి ఎంబీబీఎస్ ఉచిత సీటు సాధించడం పట్ల ఆమె ప్రతిభను అభినందించారు. తెలంగాణ రెసిడెన్షియల్ మైనార్టీ కళాశాలలో చదివి సీటు సాధించడం ఎంతో గర్వంగా ఉందని అనూష పేర్కొంది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కేసీఆర్ ముందుచూపుతో ఏర్పాటు చేసిన మైనార్టీ, గురుకుల కళాశాలల ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులు తమలో ఉన్న ప్రతిభను వెలికి తీస్తూ ఉన్నతస్థాయికి ఎదుగుతున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో మెడికల్ కళాశాలలను ఎక్కువగా నెలకొల్పడం వలన రాబోయే రోజుల్లో పేదలకు వైద్యం మరింత చేరువ అవుతుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి బీఆర్ఎస్ విభాగం అధ్యక్షులు గెల్లి శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

# సంస్థాగతంగా నిర్మాణంలో ఏకమవుదాం

- సామాజికంగా, ఆర్థికంగా మున్నూరు కాపులు బలోపేతం కావాలి...కురిసెట్టి నాగబాబు నాయుడు... మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు



**అశ్వారావుపేట, అక్టోబర్ 26, (ప్రజాజ్యోతి :** మున్నూరు కాపులు సంస్థాగతంగా ఏకమవుతూ, సామాజికంగా ఆర్థికంగా కుల సంఘాలను బలోపేతం చేయాలని మున్నూరు కాపు సంఘం మండల అధ్యక్షులు కురిసెట్టి నాగబాబు నాయుడు అన్నారు. ఆదివారం నియోజకవర్గం లోని జంగారెడ్డిగూడెం రోడ్డులో గల ఫంక్షన్ హాలు లో మున్నూరు కాపు సంఘం మండల కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరు కాపుల్లో ఆర్థికంగా బలహీనంగా ఉన్న వారిని ఆదరిస్తూ ఉపాధి అవకాశాలను కల్పిస్తూ సహాయం చేయటం వలన సంఘంగా శక్తిని పెంచుకోవచ్చన్నారు. అలానే మున్నూరు కాపు యువకులు రాజకీయ సామాజిక రంగాలలో క్రియాశీలకంగా తయారు కావాలని, సమాజానికి అవసరమైన పనులు చేస్తూనే వ్యక్తిగతంగా కూడా పలువురికి సహాయం చేస్తూ నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. అదే విధంగా నవంబర్ 9వ తేదీ మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో హాజరై దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ యూఎస్ ప్రకాష్ రావు సంఘం గౌరవ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, కార్యదర్శి కట్టా శ్రీనివాసరావు ఉపాధ్యక్షులు పసుపులేటి రామస్వామి నాయుడు పాశం రామారావు తాడేపల్లి రవి, బండారు శ్రీనివాసరావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు తిరుమల శెట్టి అప్పారావు, మున్నూరు కాపు సంఘం యువజన విభాగం అధ్యక్షులు చిక్కం గోపాలకృష్ణ, కట్టా సుబ్బారావు, దండా బత్తుల నరేష్, బండారు చంద్రశేఖర్ మట్టకుంట కామేష్, రఘురాం, పవన్ కుమార్ పసుపులేటి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది

- ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ దశల వారీ ఆందోళన స్థానిక ఎన్నికలకు గులాబీ సైన్యం సిద్ధం కావాలి.
- బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణలో రావులపల్లి పిలుపు



**భద్రాచలం, అక్టోబరు 28,(ప్రజాజ్యోతి :** ప్రజా సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో దశల వారీ ఆందోళనలకు సిద్ధం కావాలని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి మాయమాటలు చెప్పి అబద్ధాలు ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిందని బీఆర్ఎస్ జిల్లా నాయకులు రావులపల్లిరాంప్రసాద్ అన్నారు. భద్రాచలంలో ఆదివారం స్థానిక అంబేద్కర్ సెంటర్లో మండల కన్వీనర్ ఆకోజు సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ పతాకాన్ని రావులపల్లి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటం రూపకల్పన చేయాలని భద్రాచలం పట్టణంలో అసంపూర్తిగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం దశలవారీ ఆందోళనకు శ్రీకారం చుట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కోసం పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కోసం ప్రజల పక్షాన పోరాటం చేసి అడుగడుగునా కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేస్తూ ప్రభుత్వాన్ని నిలదీయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కో కన్వీనర్ రేపాక పూర్ణచంద్రరావు, కొల్లం జయప్రేమ్కుమార్, అయినాల రామకృష్ణ, రావూరి రవికిరణ్, కొలిపాక శివ, పసుపులేటి రమేష్, బాడిస నాగరాజు, బాసిపోయిన మోహనరావు, కల్లూరి శ్రీరాములు, అంబటికర్ర కృష్ణ, డానియేల్ ప్రదీప్, జక్కం గోపి, గొల్ల మన్మధరావు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం - నవంబర్ 1న చలో హైదరాబాద్

- దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీని విజయవంతం చేయండి – కొలికపోగు కాంతారావు మాదిగ పిలుపు



**దమ్మపేట, అక్టోబర్ 26 (ప్రజా జ్యోతి):** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, దళితుల ఆత్మగౌరవ పరిరక్షణ కోసం నవంబర్ 1న హైదరాబాద్లో జరిగే "చలో హైదరాబాద్ – దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీ" ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొలికపోగు కాంతారావు మాదిగ పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, దమ్మపేట మండలం, పట్వారిగూడెం గ్రామంలో ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్. పి అనుబంధ సంఘాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొలికపోగు అశోక్ కుమార్ మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి కొలికపోగు కాంతారావు మాదిగ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ– చీఫ్ జస్టిస్ గవాయి గారిపై దాడి కేవలం వ్యక్తిపై కాదు, అది రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, దళితుల ఆత్మగౌరవంపై దాడి అని, ప్రతి దళితుడు, రాజ్యాంగ విలువలను గౌరవించే ప్రతి పౌరుడు, ప్రజాస్వామ్య స్ఫూర్తి కలిగిన నాయకుడు, కార్యకర్త, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, నియోజకవర్గ బాధ్యులు, మండల ఇన్చార్జులు సమష్టిగా కృషి చేసి నవంబర్ 1న చలో హైదరాబాద్ ర్యాలీని ఘనవిజయవంతం చేయాలి" అని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కొలికపోగు ముసలయ్య మాదిగ, కొలికపోగు రవి మాదిగ, రావూరు వీరయ్య మాదిగ, రాయల పుల్లారావు మాదిగ తదితర ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.